## సింగరేణి కార్మికులపై
# సీఎంకు ఎనలేని ప్రేమ

**ఉద్యమంలో బాసటగా నిలిచిన వారిని కేసీఆర్ అక్కున చేర్చుకున్నారు**

**వారి పట్ల అభిమానంతో అనేక హక్కులు, సౌకర్యాలు కల్పించారు**

**సింగరేణి గనుల ప్రచారంలో బీఆర్ఎస్ అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావు**



మాట్లాడుతున్న వనమా వెంకటేశ్వరరావు

రామవరం, నవంబర్ 17: సింగరేణి కార్మికులపై సీఎం కేసీఆర్‌కు ఎనలేని ప్రేమ ఉందని బీఆర్ఎస్ కొత్తగూడెం నియోజకవర్గ అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో సింగరేణి కార్మికులంతా ఉద్యమ నేత కేసీఆర్‌కు బాసటగా నిలిచారని గుర్తుచేశారు. అందుకే వారి పట్ల ఆయనకు అమితమైన అభిమానం ఉందని, అందుకే వారిని ఆయన అక్కున చేర్చుకున్నారని వివరించారు. అందుకోసమే వారికి అనేక హక్కులు, సౌకర్యాలు కల్పించారని గుర్తుచేశారు. టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్ ఆధ్వర్యంలో సింగరేణి కొత్తగూడెం ఏరియా జీకేవోసీ, పీవీకే 5 గని, ఏరియా వర్క్‌షాపుల్లో శుక్రవారం పర్యటించిన ఆయన.. ఆయా ప్రాంతాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం చేసి వివిధ కార్నర్ మీటింగుల్లో మాట్లాడారు. సింగరేణి కార్మికులపై ఉన్న ప్రేమ, గౌరవంతోనే సీఎం కేసీఆర్ ఎన్నో సదుపాయాలు కల్పించారని అన్నారు. తాను కూడా ఇక్కడే పుట్టి పెరిగిన వాడినని, ఈ ప్రాంతం వాసిగా తనకు ఇక్కడి కార్మికుల పరిస్థితులు తెలుసునని అన్నారు. ఏ వేళ ఏ కష్టం వచ్చినా తాను అండగా ఉంటున్నానని అన్నారు. 20 సంవత్సరాల క్రితం 5బీ గనిని మూసివేయాలని యాజమాన్యం ప్రయత్నిస్తే అప్పుడు తాను ఆమరణ నిరాహార దీక్ష చేసి ఆ మైన్‌ను కాపాడానని గుర్తుచేశారు. అదే విధంగా వీకే 7 మైన్ మూసివేస్తే ఆ మైన్ కార్మికులు ఇతర ఏరియాలకు బదిలీలు కాకుండా ఇక్కడే సర్దుబాటు చేయించేందుకు కృషిచేశానని వివరించారు. కార్మికుల పక్షాన ఉన్న తనకు ఈ ఎన్నికల్లో మరోసారి అవకాశం కల్పించాలని కోరారు. అలాగే, సీఎం కేసీఆర్‌కు హ్యాట్రిక్ విజయాన్ని అందించాలని పిలుపునిచ్చారు. ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నేతలు, టీబీజీకేఎస్ నాయకులు కంచర్ల చంద్రశేఖర్‌రావు, జేవీఎస్ చౌదరి, బదావత్ శాంతి, ఎండీ రజాక్, కూసన వీరభద్రం, కాపు కృష్ణ, అబ్దుల్ ఉమర్, చిలక రాజయ్య, చెరిపల్లి నాగరాజు, బుటిక రాజేశ్వరరావు, మోహన్‌రెడ్డి, జల్లి కిరణ్, సకినాల సమ్మయ్య, సవీర్, రవీందర్, నిమ్మల సాగర్, శ్రీనివాస్, శంకర్, బాబు, రమాకాంత్, అజీమ్, వేణు, భరత్, నరసింహారావు పాల్గొన్నారు.

# సీఎం కేసీఆర్‌తోనే ఖమ్మం అభివృద్ధి

- అది కొనసాగాలంటే బీఆర్ఎస్ ప్రభుత్వమే మళ్లీ గెలవాలి
- అందుకోసం నియోజకవర్గ ప్రజలు నాకు మెజార్టీ ఇవ్వాలి
- బయటి వ్యక్తులెవరూ ఖమ్మంపై ఇంత ప్రేమ చూపించరు
- ఖమ్మం నగర ప్రచారంలో బీఆర్ఎస్ అభ్యర్థి అజయ్‌కుమార్



రోడ్ షోకు హాజరైన బీఆర్ఎస్ కార్యకర్తలు, అభిమానులు, అభివాదం చేస్తున్న పువ్వాడ అజయ్

ఖమ్మం, నవంబర్ 17: సీఎం కేసీఆర్ సహకారం వల్లనే ఖమ్మం నియోజకవర్గం ఇంతలా అభివృద్ధి చెందిందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, బీఆర్ఎస్ ఖమ్మం నియోజకవర్గ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఈ అభివృద్ధి మరింతగా కొనసాగాలంటే బీఆర్ఎస్ ప్రభుత్వమే మళ్లీ గెలవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. అందుకోసం నియోజకవర్గ ప్రజలందరూ కారు గుర్తుకు ఓటు వేసి తనకు అత్యధిక మెజార్టీ అందించాలని కోరారు. ఖమ్మం నగరంలో శుక్రవారం పర్యటించిన ఆయన.. 53, 54, 55, 56 డివిజన్లలో విస్తృత ప్రచారాలు, రోడ్‌షోలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను ఇక్కడి వాడినని, అందుకే ఇక్కడి ప్రజలు తనను రెండుసార్లు గెలిపించారని గుర్తుచేశారు. అందుకే ఖమ్మంపై ఉన్న మమకారంతో తాను ఈ నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశానని అన్నారు. కానీ బయటి వ్యక్తులెవరూ ఖమ్మంపై ఇంత ప్రేమ చూపించలేరని అన్నారు. ఖమ్మం నియోజకవర్గం మరింత ప్రగతి సాధించాలంటే ఇక్కడ బీఆర్ఎస్ విజయం సాధించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఖమ్మంలో కాకరకాయలు కూడా పంచని వాళ్లంతా ఇప్పుడొచ్చారని, ఎన్నికల వేళ ఎన్నో కహానీలు చెబుతున్నారని విమర్శించారు. అభివృద్ధిని కాంక్షించే వాళ్లెవరో, వెన్నుపోటు పొడిచే వాళ్లెవరో నియోజకవర్గ ప్రజలు గమనించాలని కోరారు. ఒకప్పుడు కనీస సదుపాయాలు లేని ఖమ్మాన్ని తానే తీర్చిదిద్దానని, అన్ని జిల్లాలకు ఆదర్శంగా నిలిపానని అన్నారు. లకారం ట్యాంక్‌బండ్, ఐటీ హబ్, పార్కులు, ఓపెన్ జిమ్‌లు, వాకింగ్ ట్రాక్‌లు, క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశానని వివరించారు. ఇవే గాక నూతన బస్టాండ్, ధంసలాపురం ఆర్వోబీ, నూతన మున్సిపల్ కార్పొరేషన్ భవనం వంటివన్నీ కళ్లముందే కన్పిస్తున్నాయని అన్నారు. మరింత అభివృద్ధి కోసం కారు గుర్తుకు ఓటు వేసి తనకు అధిక మెజార్టీ అందించాలని కోరారు. ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు మేయర్ పునుకొల్లు నీరజ, కూరాకుల నాగభూషణం, మోతారపు శ్రావణి, సుధాకర్, పైడిపల్లి రోహిణి, సత్యనారాయణ, చిరుమామిళ్ల లక్ష్మి, నాగేశ్వరరావు, కర్నాటి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్‌తోనే అభివృద్ధి, సంక్షేమం

- అందుకోసమే బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గెలిపించండి..
- సీఎం సహకారంతోనే వంతెనలు, రహదారుల నిర్మాణం
- ఐదేళ్లకు ఒక్కసారి వచ్చే నాయకులను అసలే నమ్మవద్దు
- ఆళ్లపల్లి ప్రచారంలో బీఆర్ఎస్ అభ్యర్థి రేగా కాంతారావు



తిలకం దిద్దుతున్న మహిళా కార్యకర్త

ఆళ్లపల్లి, నవంబర్ 17: సీఎం కేసీఆర్‌తోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని ప్రభుత్వ విప్, బీఆర్ఎస్ పినపాక నియోజకవర్గ అభ్యర్థి రేగా కాంతారావు పేర్కొన్నారు. అందుకోసమే ప్రజలు కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గెలిపించాలని కోరారు. ఏజెన్సీ పల్లెలు కూడా బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే అభివృద్ధి చెందాయని అన్నారు. ఆళ్లపల్లి మండలంలో శుక్రవారం పర్యటించిన ఆయన.. రాయిపాడు, ముత్తాపురం, అనంతోగు, వెంకటాపురం, ఆళ్లపల్లి, లక్ష్మీపురం, మైలారం, ఇప్పనపల్లి, తీగలంచ, వలసల్ల, పాతూరు, రామాంజిగూడెం, రఘువాపురం, పెద్దూరు, సందింబంధం, నడిమిగూడెం, జాకారం, లొద్దిగూడెం, బోడాయికుంట, మర్కోడు, జిన్నెలగూడెం గ్రామాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు మహిళలు మంగళహారతులు పట్టి, బొట్టు పెట్టి స్వాగతం పలికారు. ఆయా గ్రామాల్లో జరిగిన ప్రచారంలో ఆయన మాట్లాడుతూ.. ఈ ఎన్నికల్లోనూ కేసీఆర్ ప్రభుత్వం గెలిస్తేనే మరిన్ని అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలవుతాయని స్పష్టం చేశారు. సీఎం కేసీఆర్ సహకారంతోనే నియోజకవర్గంలో వంతెనలు, బీటీ రహదారులు, సీసీ రోడ్లు నిర్మించినట్లు వివరించారు. ఆదివాసీలను ఆదుకుంటున్న కేసీఆర్ ప్రభుత్వాన్ని ఆదరించాలని కోరారు. ఐదేళ్లకు ఒక్కసారి మాత్రమే వచ్చే నాయకులను అసలే నమ్మవద్దని సూచించారు. తొలుత రేగా కాంతారావు.. రాయిపాడు అంజనేయ స్వామి గుడి వద్ద కొబ్బరికాయ కొట్టి ప్రచారం ప్రారంభించారు. ప్రచారంలో భాగంగా మండలంలోని వివిధ గ్రామాల్లో ఆయా పార్టీలకు చెందిన 100 కుటుంబాల వారు ప్రభుత్వ విప్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు కోండ్రు మంజుభార్గవి, రామయ్య, వెంకటేశ్వర్లు, శంకర్‌బాబు, నరసింహారావు, వెంకటనారాయణ, ప్రేమకళ, నిర్మల, కమల, నర్సింహారావు, పాయం నరసింహారావు, షేక్ బాబా, రాంబాబు, ఆఫీజ్, వెంకటేశ్, సతీశ్, ఆదాం, ఆరీఫ్, కిశోర్‌బాబు, భద్రం, ప్రసాద్, రవికుమార్, ఖయ్యూం, ప్రవీణ్, నరేశ్, సమ్మయ్య, సాంబయ్య, సుధాకర్, బాబు, సాయన్న, రవి, సత్యం తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌కు అండగా నిలవాలి

**పని చేసే వారిని ఆదరించండి.. అభివృద్ధికి సహకరించండి..**

**ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత కేసీఆర్‌దే..**

**అన్నపురెడ్డిపల్లి ప్రచారంలో బీఆర్ఎస్ అభ్యర్థి నాగేశ్వరరావు**



మ్యానిఫెస్టోను వివరిస్తున్న ఎమ్మెల్యే మెచ్చా

అన్నపురెడ్డిపల్లి, నవంబర్ 17: సంక్షేమ సర్కారుగా పేరుగాంచిన బీఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని బీఆర్ఎస్ అశ్వారావుపేట నియోజకవర్గ అభ్యర్థి మెచ్చా నాగేశ్వరరావు కోరారు. ప్రజల కోసం పని చేసే వారిని ఆదరించాలని అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అన్నపురెడ్డిపల్లి మండలంలో శుక్రవారం పర్యటించిన ఆయన.. పెంట్లం, నర్సాపురం, ఊటుపల్లి, భీమునిగూడెం, పెద్దిరెడ్డిగూడెం, గుంపెన పంచాయతీల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందాయని అన్నారు. వాటి ద్వారా లబ్ధిపొందిన ప్రజలందరూ కారు గుర్తుకు ఓటు వేసి తనకు భారీ మెజార్టీ అందించాలని కోరారు. సీఎం కేసీఆర్ సహకారంతో అశ్వారావుపేట నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేశానని అన్నారు. మరోసారి ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి చేస్తానని మాట ఇచ్చారు. రాష్ట్రంలో కూడా బీఆర్ఎస్‌ను మళ్లీ గెలిపించుకుందామని, కేసీఆర్‌ను హ్యాట్రిక్ ముఖ్యమంత్రిగా చూద్దామని పిలుపునిచ్చారు. 60 ఏళ్లలో కాంగ్రెస్ పాలకులు చేయని అభివృద్ధిని సీఎం కేసీఆర్ కేవలం పదేళ్లలోనే చేసి చూపించారని గుర్తుచేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మూడోసారి కూడా అధికారంలోకి వస్తే కొత్త మ్యానిఫెస్టో ప్రకారం మరిన్ని పథకాలు అమలవుతాయని వివరించారు. ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు బోయినపల్లి సుధాకర్‌రావు, తాటి వెంకటేశ్వర్లు, సున్నం నాగమణి, వగ్గెల పూజ, భూక్యా ప్రసాద్, సోయం వీరభద్రం, మామిళ్లపల్లి రామారావు, కొత్తూరి వెంకటేశ్వరరావు, జంగాల ఉమా, లక్ష్మణరావు, నర్సారెడ్డి, మాధవరెడ్డి, వరప్రసాద్, వెంకటేశ్వర్లు, చల్లా రాంబాబు, హరీష్, సురేష్, హమీద్, శివ, రామకృష్ణ, రంగ, పుల్లారావు, రాంబాబు, జమలయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# కళ్లముందున్న అభివృద్ధిని చూసి ఓటేయండి

- కల్లబొల్లి మాటలకు, గ్యారెంటీ హామీలకు మోసపోకండి..
- ప్రజల కోసం పనిచేసేవారిని ఎల్లప్పుడూ ఆశీర్వదించండి
- జూలూరుపాడు ప్రచారంలో బీఆర్ఎస్ అభ్యర్థి మదన్‌లాల్



మాట్లాడుతున్న బానోత్ మదన్‌లాల్

జూలూరుపాడు, నవంబర్ 17: నియోజకవర్గ ప్రజలందరూ కళ్లముందు జరిగిన అభివృద్ధిని చేసి ఓటు వేయాలని బీఆర్ఎస్ వైరా నియోజకవర్గ అభ్యర్థి బానోత్ మదన్‌లాల్ కోరారు. కేవలం ఎన్నికల సమయంలోనే వచ్చి చెప్పే కల్లబొల్లి మాటలకు, ఇచ్చే గ్యారెంటీ హామీలకు మోసపోవద్దని సూచించారు. ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం నిత్యం పనిచేసే వాళ్లను ఎల్లప్పుడూ ఆదరించాలని కోరారు. మరింత అభివృద్ధి కోసం కారు గుర్తుకి ఓటు వేసి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని బలపరచాలని విజ్ఞప్తి చేశారు. జూలూరుపాడు మండలంలో శుక్రవారం పర్యటించిన ఆయన.. సాయిరాంతండా, దండుమిట్టతండా, పడమట నర్సాపురం, మాచినేనిపేటతండా, చింతల్‌తండా, కరివారిగూడెం, కొమ్ముగూడెం, గురువాగుతండా, దుబ్బతండా, కాకర్ల, మాచినేనిపేట గ్రామాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని ప్రజలు, మహిళలు ఆయన ఘన స్వాగతం పలికారు. బొట్టుపెట్టి మంగళహారతులిచ్చారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధిలో తెలంగాణను ఆదర్శంగా నిలిపిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని స్పష్టం చేశారు. దీంతో తెలంగాణ మోడల్‌ను దేశంలోని అనేక రాష్ట్రాలు అనుసరిస్తున్నాయని అన్నారు. ఆయా రాష్ట్రాల ప్రజలు తెలంగాణలో ఉన్నటువంటి పథకాలు కోరుకుంటున్నారని అన్నారు. ఇంతటి అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందిస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఆదరించాలని కోరారు. కేసీఆర్‌ను మరోసారి సీఎం చేయాలని పిలుపునిచ్చారు. ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో తనకు అత్యధిక మెజార్టీ అందించాలని కోరారు. ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు లావుడ్యా సోని, కళావతి, యల్లంకి సత్యనారాయణ, లాకావత్ గిరిబాబు, కట్రం మోహన్‌రావు, చెరుకుమల్లి రుక్కయ్య, దుద్దుకూరి నాగేశ్వరరావు, చావా వెంకటరామారావు, మూడు చిట్టిబాబు, మాళోతు నర్సింహారావు, రమేశ్, రాములు తదితరులు పాల్గొన్నారు.